## క్లుప్తంగా

### గర్భిణులు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి



శిబిరంలో సేవలందిస్తున్న డాక్టర్ భరద్వాజ్

బొబ్బిలిరూరల్: గర్భిణులు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని పిరిడి పీహెచ్‌సీ వైద్యాధికారి భరద్వాజ సూచించారు. సీత య్యపేట గ్రామంలో సోమవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈశిబిరంలో గర్భిణులతో పాటు గ్రామానికి చెందిన పలువురికి వివిధ వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. గర్భిణులకు ఆరోగ్య జాగ్రత్తలు సూచించారు. విధిగాపౌష్టికాహారం తీసుకోవాలని, ఎక్కువగా ఆకు కూరలు తినాలని చెప్పారు.హెల్త్ సూపర్ వైజర్ ఎం.కన్నయ్య,హెల్త్ అసిస్టెంట్ ఎం.తవిటినాయుడు, వైద్య సిబ్బంది దివ్య, పార్వతి, తదితరులు పాల్గొన్నారు.

### సైబర్ నేరాలపై అప్రమత్తం



అవగాహన కల్పిస్తున్న స్వచ్ఛభారత్ మండల కో-ఆర్డినేటర్ పద్మ

రేగిడి: రోజు రోజుకీ పెరిగిపోతున్న సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్వచ్ఛ భారత్ మండల కో-ఆర్డినేటర్ పద్మ సూచించారు. మండలంలోని బూరాడ గ్రామంలో ప్రజలకు సోమవారం అవగాహన కల్పించారు. స్మార్ట్‌ఫోన్‌లలో అనవసరమైన యాప్‌లను ఉంచ వద్దని, మొబైల్స్‌కు వచ్చే లింక్‌లను ఓపెన్ చేయ వద్దని చెప్పారు.అపరిచిత వ్యక్తులు ఫోన్‌చేసి బ్యాంకు ఖాతాలు, ఏటీఎం పిన్ నెంబర్లు, ఓటీపీలు అడిగితే స్పందించవద్దని సూచించారు.సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### చదువుతోనే ఉన్నత భవిష్యత్



నాయుడువలసలో ర్యాలీ చేస్తున్న ఉపాధ్యాయుడు జె.సి.రాజు,విద్యార్థులు

రామభద్రపురం: చదువుతోనే ఉన్నత స్థాయికి ఎదగవచ్చని, సమాజంలో గౌరవం పొందుతామని ఏపీటీఎఫ్ జిల్లా నాయ కుడు జె.సి.రాజు అన్నారు.అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా మండలంలోని నాయుడువలసలో విద్యా ర్థులు, సచివాలయ సిబ్బందితో కలిసి సోమవారం అక్షరాస్యతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ అక్షరాస్యులై ఉండాలన్నారు. గ్రామాల్లోని నిరక్షరాస్యులు ఖాళీ సమ యంలో తమ పిల్లల వద్ద అక్షరాలు నేర్చుకోవాలని సూచించారు. కనీసం సంతకం వచ్చే విధంగానైనా చదువు నేర్చు కుంటే ఇతరుల వద్ద మోసపోకుండా ఉండవచ్చన్నారు.

### వైఎస్సార్‌సీపీ రాజాం పరిశీలకులుగా సూర్యనారాయణరాజు



కె.వి. సూర్యనారాయణరాజును సత్కరిస్తున్న డాక్టర్ తలే రాజేష్, తదితరులు

రాజాం: రాజాం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ పరిశీలకులుగా కె.వి. సూర్యనారాయణరాజు (పులిరాజు)ను పార్టీ అధిష్టానం నియమించింది. ఈ మేరకు రాజాం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన్ని నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్‌తో పాటు పార్టీ నాయకులు సోమవారం ఘనంగా సత్కరించారు. నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధికి, రాబోయే ఎన్నికల్లో గెలుపునకు సలహాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాజాం టౌన్, రూరల్ కన్వీనర్లు పాలవలస శ్రీనివాసరావు, లావేటి రాజగోపాలనాయుడు, పార్టీ జిల్లా కల్చరల్ వింగ్ అధ్యక్షుడు డాక్టర్ బి.నరేంద్ర, పార్టీ సర్పంచ్‌ల వింగ్ నియోజకవర్గ అధ్యక్షుడు వాకముళ్ల చిన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

### పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన డీఎస్పీ



సీజ్ చేసిన వాహనాలను పరిశీలిస్తున్న డీఎస్పీ భవ్యారెడ్డి

మెంటాడ: వార్షిక తనిఖీల్లో భాగంగా ఆంధ్ర పోలీస్ స్టేషన్‌ను బొబ్బిలి డీఎస్పీ భవ్యారెడ్డి సోమవారం సందర్శించారు. స్టేషన్ ఆవరణలో ఉన్న వివిధ కేసుల్లో సీజ్ అయిన వాహనాలను పరిశీలించారు. స్టేషన్ పరిధిలో పెండింగ్ కేసుల వివరాలపై ఎస్‌ఐ కె.సీతారామ్‌ను ఆరా తీసి, పలు సూచనలు చేశారు. అలాగే సైబర్ నేరాలు, డ్రగ్స్‌పై గ్రామాల్లో నిర్వహించిన అవగాహన సదస్సులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. డీఎస్పీ వెంట గజపతినగరం సీఐ జి.ఏ.వి.రమణ ఉన్నారు.

# అన్నదాత పోరుకు తరలిరండి

- ఎరువుల సరఫరాలో కూటమి ప్రభుత్వం విఫలం
- నేడు వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఆర్డీఓ కార్యాలయాల ఎదుట నిరసన
- రైతులు, పార్టీ శ్రేణులు తరలిరావాలని పిలుపునిచ్చిన వైఎస్సార్‌సీపీ



డాక్టర్ తలే రాజేష్

రాజాం: ఎరువుల బ్లాక్ మార్కెట్‌ను, కృత్రిమ కొరత సృష్టించడాన్ని నిరసిస్తూ రైతన్నలకు మద్దతుగా చీపురుపల్లి ఆర్డీఓ కార్యాలయం వద్ద వైఎస్సార్‌సీపీ మంగళవారం నిర్వహించనున్న 'అన్నదాత పోరు' కార్యక్రమానికి పార్టీ కార్యకర్తలు, నాయకులు, రైతులు తరలిరావాలని వైఎస్సార్‌సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అన్నదాతకు వెన్నుపోటు పొడిచిందని ఆరోపించారు. రైతులకు సకాలంలో విత్తనాలు, ఎరువులు అందించకుండా వారి నడ్డి విరుస్తోందని, వ్యవసాయ రంగాన్ని తుంగలో తొక్కే కుట్ర జరుగుతోందని మండిపడ్డారు. ఎరువుల సరఫరాలో ప్రభుత్వం విఫలమైందని అన్నారు. చీపురుపల్లిలో నిర్వహించనున్న అన్నదాత పోరు కార్యక్రమానికి మంగళవారం ఉదయం 9 గంటలకు రాజాం నుంచి బయలుదేరనున్నామని, ప్రతీ గ్రామం నుంచి పార్టీ కార్యకర్తలు రైతులతో కలిసి పార్టీ కార్యాలయం వద్దకు చేరుకోవాలని కోరారు.



తెర్లాం: 'అన్నదాత పోరు' వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

**విజయవంతం చేయండి**

తెర్లాం: ఎరువుల కొరతపై వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో బొబ్బిలి ఆర్డీఓ కార్యాలయం ముందు మంగళవారం నిర్వహించనున్న 'అన్నదాత పోరు' కార్యక్రమానికి మండలం నుంచి అధిక సంఖ్యలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, రైతులు హాజరై విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు తెంటు సత్యంనాయుడు, ఎంపీపీ ప్రతినిధి నర్సుపల్లి బాబ్జీ రావు, జెడ్పీటీసీ ప్రతినిధి గర్భాపు రామా రావు, వైస్ ఎంపీపీలు చేపేన సత్యనారాయణ, అప్పలరాజు పిలుపునిచ్చారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో 'అన్నదాత పోరు' వాల్ పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. సర్పంచ్ బోడెల విజయబాబు, నాయకులు మృత్యుంజయ రావు, గరే రాము, శంకరరావు, వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

**నాడు రైతు రాజులా బతికాడు**

రామభద్రపురం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రైతు సంక్షేమానికి పెద్దపీట వేయడంతో నాడు రైతు రాజులా బతికాడని జెడ్పీటీసీ సభ్యురాలు అప్పి కొండ సరస్వతి అన్నారు. నేడు రైతులకు ఎరువులు సరఫరా చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఎరువుల కొరతపై ప్రభుత్వం తీరుకు నిరసనగా బొబ్బిలి ఆర్డీఓ కార్యాలయం ముందు వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో మంగళవారం 'అన్నదాత పోరు' కార్యక్రమం నిర్వహించనున్నట్టు చెప్పారు. సంబంధిత వాల్ పోస్టర్లను స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం ఆవిష్కరించారు. వైఎస్సార్‌సీపీ మండల జేసీఎస్ కన్వీనర్ చింతల సింహాచలం నాయుడు, పార్టీ ఉపాధ్యక్షుడు డర్రు పైడిరాజు, పాల సొసైటీ అధ్యక్షుడు చొక్కాపు రామ కృష్ణ, బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ రాయులు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కిర్ల చంద్రశేఖర్ పాల్గొన్నారు.

**రైతుల కష్టాలను పట్టించుకోవడం లేదు**

బాడంగి: ఎరువుల బ్లాక్ మార్కెటింగ్‌ను నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో బొబ్బిలి ఆర్డీఓ కార్యాలయం వద్ద మంగళవారం చేపట్టనున్న 'అన్నదాత పోరు' కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులు, రైతులు జయప్రదం చేయాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు యామల శివప్రసాద్ కోరారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో 'అన్నదాత పోరు' వాల్‌పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల కష్టాలు కూటమి ప్రభుత్వానికి పట్టడం లేదన్నారు. ప్రభుత్వమే ఎరువుల బ్లాక్‌మార్కెట్‌ను ప్రోత్సహిస్తోందని ఆరోపించారు. ఎంపీపీ భోగి గౌరి, సలహాదారు తెంటుమధు, వైస్ ఎంపీపీలు రమేష్, వెంకటనాయుడు,నియోజకవర్గ యువజన, విద్యార్థి విభాగాల అధ్యక్షులు బేతనపల్లి శంకరరావు,తెంటు తిరుపతిరావు, నాయకులు తెర్లి శ్రీను,బంగారురాజు,రామినాయుడు, గొర్లెశంకరరావు, మరడ రమణ,పైడిరాజు,శేఖర్ పాల్గొన్నారు.



బాడంగి: వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



రామభద్రపురం: వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ సరస్వతి, నాయకులు

## యూరియా ఎప్పుడిస్తారో చెప్పాలి..?




సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ గౌరి, వైస్ ఎంపీపీలు

- మండల సర్వసభ్య సమావేశంలో ఏఓను నిలదీసిన సభ్యులు

బాడంగి: తమ రైతు సేవా కేంద్రానికి యూరియా ఎప్పుడు వస్తుందో చెప్పాలని తెంటువలస సర్పంచ్ తెంటు చిరంజీవరావు మండల వ్యవసాయ అధికారిని నిలదీశారు.స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ భోగి గౌరి అధ్యక్షతన మండల సర్వసభ్య సమా వేశం సోమవారం నిర్వహించారు. శాఖల వారీగా సమస్యలను సభ్యులు సభ దృష్టికి తీసుకువచ్చారు. ఎరువుల సమస్యపై తెంటు వలస సర్పంచ్ మాట్లాడుతూ తమ రైతు సేవా కేంద్రానికి వారం రోజులుగా ఇదిగో యూరియా పంపిస్తున్నామని అంటున్నారే కానీ ఒక్క బస్తా కూడా రాలేదన్నారు. వరి కోతలు అయిపోయాక ఎరువులు ఇస్తారా అని నిలదీశారు. మూడురోజుల్లోగా యూరియా రాకుంటే తగిన రీతిలో స్పందిస్తామని హెచ్చరించారు. దీనికి వ్యవసాయ అధికారి సమాధానం ఇస్తూ జిల్లాకు వచ్చిన స్టాక్ ప్రాప్తికి మండలానికి ఇస్తున్నారని బదులిచ్చారు. విద్యుత్‌శాఖ ఏఈసాంబశివరావు మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలో దెబ్బతిన్న 60 విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేశామని చెప్పారు. స్థానిక సొసైటీ అధ్యక్షుడు లచ్చుపతుల సత్యం మధ్యలో కలుగు చేసుకుని విద్యుత్ సమస్యలపై ఏఈ స్పందించడం లేదని అన్నారు. గొల్లాది, గజరాయునివలలో కొత్తగా మంజూరైన వ్యవసాయ మోటార్లకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, లైన్ పనులు చేయడంలేదని ఆరోపించారు. ఏఈ స్పందిస్తూ ట్రాన్స్‌ఫార్మర్లకొరత ఉన్నందున ఆలస్యం అవుతోందన్నారు. బాడంగి,గూడెపువలస,మల్లంపేట గ్రామాల్లో విద్యుత్ సమస్యలను ఆయా గ్రామాల సర్పంచ్‌లు సభ దృష్టికి తీసుకువచ్చారు. తహసీల్దార్ వరప్రసాద్ మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలేమైనా ఉంటే తప్పక పరిష్కరిస్తామన్నారు. వైస్ ఎంపీపీలు సింగిరెడ్డి భాస్కరరావు, బి.రమేష్, జెడ్పీటీసీ పెద్దింటి రామారావు,ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ, ఎంఈఓ లక్ష్మణదొర, తదితరులు పాల్గొన్నారు.

## జూట్‌మిల్లులోని ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలి



ఆర్డీఓ కార్యాలయంలో సిబ్బందికి వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ కార్యవర్గం

బొబ్బిలి:పట్టణంలోని పురాతన జూట్‌మిల్లు ఆవరణలో ఉన్న ప్రభుత్వ స్థలాలను కాపాడాలని కోరుతూ సీపీఐ కార్యవర్గం ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం వినతిపత్రాన్ని అందజేసింది. సీపీఐ కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ పాత జూట్‌మిల్లు కొనుగోలు చేసిన వ్యాపారులంతా జూట్ మిల్లు ఆవరణలో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేశారన్నారు. కబ్జా చేసిన స్థలాన్ని గుర్తించిన రెవెన్యూ యంత్రాంగం అక్కడ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసిందని, ఈ బోర్డులను తొలగించి మరీ వ్యాపారులు స్థలాన్ని కైవసం చేసుకునే ప్రయత్నంలో ఉన్నారని అన్నారు. వెంటనే సంబంధిత స్థలాన్ని మళ్లీ గుర్తించి బోర్డులు ఏర్పాటు చేయాలని, బోర్డులు తొలగించిన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మిరమణ, జిల్లా కార్యవర్గ సభ్యులు కోట అప్పన్న, పట్టణ కార్యదర్శి మునకాల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

## రైతన్నకు బాసటగా వైఎస్సార్‌సీపీ



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మెంటాడ: రైతులకు వైఎస్సార్‌సీపీ అన్ని విధాలా బాసటగా నిలుస్తుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు రాయిపల్లి రామారావు అన్నారు.మండల కేంద్రంలో ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడుతో కలిసి సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రైతులకు సరాపడా యూరియా సరఫరా చేయకుండా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుకు నిరసనగా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో మంగళవారం 'అన్నదాత పోరు' కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని ఆయన చెప్పారు. ఉదయం 10 గంటలకు మాజీ ఉపముఖ్యమంత్రి రాజన్నదొర ఆధ్వర్యంలో సాలూరు నియోజకవర్గం నుంచి పార్వతీపురం వెళ్లనున్నట్లు పేర్కొన్నారు.మండలం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, రైతులు తరలిరావాలని కోరారు. నాయకులు రెడ్డి రాజప్పలనాయుడు ,మీసాల గురునాయుడు ,సిరిసెట్టి నారాయణరావు, సువ్వని నారంనాయుడు,బొద్దాని అప్పలస్వామి పాల్గొన్నారు.

## అంబకండిలో ఆయుర్వేద వైద్య శిబిరం



శిబిరంలో సేవలందిస్తున్న వైద్యాధికారి సునీల్‌కుమార్

రేగిడి:

మండలంలోని అంబకండి గ్రామంలో సోమవారం ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. ఖండ్యాం ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారి ఎం.సునీల్‌కుమార్ శిబిరంలో 124 మందికి వైద్య పరీక్షలు చేశారు. కీళ్ల, నడుమనొప్పులు, జలుబు, ఆయాసం తదితర ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి ఆయుర్వేద మందులను ఉచితంగా అందజేశారు. సర్పంచ్ ఎస్.గోవిందనాయుడు, ఎంపీటీసీ సభ్యురాలు పి.సత్యవతి, యోగా శిక్షకులు ఎం.రామకష్ణ, పి.శైలజ, ఎంఎల్‌హెచ్‌పీ కృష్ణవేణి, హెల్త్ అసిస్టెంట్ పిల్లిరాజు, తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



వాహన తనిఖీలు చేస్తున్న ఎస్‌ఐ షేక్‌శంకర్

వంగర: ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఎస్‌ఐ షేక్‌శంకర్ హెచ్చరించారు. మండల కేంద్రంలోని ప్రధాన రహదారిలో సోమవారం వాహన, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. వాహనాల పత్రాలు, వాహన చోదకుల లైసెన్స్‌లు పరిశీలించారు. బ్రీత్ ఎన్‌లైజర్‌తో వాహనచోదకులను పరీక్షించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు, జరిమానా తప్పవన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే సంబంధిత వాహన యజమానిపై చర్యలు తీసుకుంటామన్నారు. ద్విచక్ర వాహన చోదకులు విధిగా హెల్మెట్ ధరించాలని చెప్పారు. ఏఎస్‌ఐ ప్రసాద్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల

బొబ్బిలిరూరల్: మండలంలోని గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదలయ్యాయని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ అల్లు భాస్కరరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. టైడ్ గ్రాంట్ క్రింద రూ.73,02,181, అన్‌టైడ్ గ్రాంటు క్రింద రూ.48,68,793 విడదలయ్యాయని పేర్కొన్నారు. మొత్తం కోటి 21లక్షల,71వేల,974 రూపాయలు విడుదలయ్యాయని,టైడ్‌గ్రాంటు నిధులతో పారిశుద్ధ్యం,ఓటీఎఫ్,తాగునీటి నిర్వహణ, వాటర్ క్లోరినేషన్ తదితర పనులు చేపట్టాలని, అన్‌టైడ్ గ్రాంటు నిధులను రోడ్లు, డ్రైయిన్లు, వీధి లైట్లు, విద్యుత్ బిల్లులు, తదితర పనులకు వినియోగించుకోవచ్చని చెప్పారు.

## పీఆర్సీ ప్రకటించాలి



మాట్లాడుతున్న కార్మిక సంఘాల నాయకులు

రాజాం సిటీ: రాష్ట్ర ప్రభుత్వం 12వ పీఆర్సీని వెంటనే ప్రకటించాలని మున్సిపల్ కార్మిక సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు పడాల లక్ష్మి, అనీల్‌కుమార్ డిమాండ్ చేశారు. స్థానిక మున్సి పల్ కార్యాలయ ఆవరణలో సంఘం గౌరవాధ్యక్షుడు సీహెచ్.రామ్మూర్తినాయుడుతో కలిసి సోమవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభు త్వం ఏర్పడి ఏడాదిన్నర కావస్తోందని, మేనిఫెస్టోలో పేర్కొన్న మేరకు వెంటనే పీఆర్సీ ప్రకటిం చాలని కోరారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులకు ఉద్యోగభద్రత కల్పించాలని, రెగ్యులర్ చేసే ప్రక్రియను ప్రారంభించాలని డిమాండ్ చేశారు.కార్మికులు వైకుంఠ, వాసు, బాలరాజు, గురువులు, తదితరులు పాల్గొన్నారు.

## పరామర్శ



అనసూయమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్, తదితరులు

రాజాం సిటీ: మండలంలోని బొద్దాం గ్రామానికి చెందిన వైస్ ఎంపీపీ నక్క వర్షిణి తల్లి పోగోటి అనసూయ మ్మ, వైఎస్సార్‌సీపీ నాయకుడు నక్క మోహన్ నానమ్మ నక్క ఆదిలక్ష్మి ఇటీవల మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ సోమవారం ఆయా కుటుంబీకులను పరామర్శించారు. మృతుల చిత్రపటాల వద్ద నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో వైఎస్సార్‌సీపీ రాజాం రూరల్, టౌన్ కన్వీనర్లు లావేటి రాజగోపాలనాయుడు, పాలవలస శ్రీనివాసరావు, వంగర ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ, రేగిడి మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ వావిలపల్లి జగన్‌మోహనరావు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు వాకముళ్ల చిన్నంనాయుడు, వై.వాసు, సర్పంచ్‌లు నక్క శ్రీను, కొర్ను ఈశ్వరరావు, గెడ్డాపు అప్పలనాయుడు, ముదిలి జనార్దనరావు, నక్క ఉమామహేశ్వరరావు, పి.సన్యాసినాయుడు, శ్రీనివాసరావు, ఎం.గోవింద, లోకేష్, నర్సింగరావు, అప్పలనాయుడు, రవితేజ తదితరులు ఉన్నారు.

## సమస్యలపై వినతి



ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రమణకు వినతిపత్రం అందజేస్తున్న జగనన్న కాలనీవాసులు

తెర్లాం: స్థానిక జగనన్న కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కాలనీ వాసులు మండల పరిషత్ కార్యాలయంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రమణకు సోమవారం వినతిపత్రం అందజేశారు. కాలనీ వాసులు ఆమిటి శ్రీనివాసరావు, కాంతారావు, రాజు, శ్రీను తదితరులు మాట్లాడుతూ కాలనీలో వీధి లైట్లు, సీసీ రోడ్లు, ఇంటింటికీ తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేయాలని కోరారు. స్పందించిన ఇన్‌చార్జ్ ఎంపీడీఓ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతానని చెప్పారు.

## ఆత్మరక్షణ విద్య అందరికీ అవసరం

- డీఎస్పీ భవ్యారెడ్డి



బొబ్బిలి: తైక్వాండో శిక్షణను పరిశీలిస్తున్న డీఎస్పీ భవ్యారెడ్డి,తదితరులు



రేగిడి: దేవుదల కేజీబీవీలో శిక్షణ పొందుతున్న విద్యార్థినులు



వంగర: తైక్వాండోపై బాలికలకు శిక్షణ ఇస్తున్న కోచ్ శ్రీను

బొబ్బిలి:

ఆత్మరక్షణవిద్య అందరికీ అవసరమని డీఎస్పీ జి.భవ్యారెడ్డి అన్నారు. పట్టణంలోని అభ్యుదయ పాఠశాలలో ఉన్నతపాఠశాల విద్యార్థులకు సోమవారం తైక్వాండో శిక్షణ ప్రారంభించారు. రోజూ విద్యార్థులకు క్లాసులు నేర్పించేందుకు కోచ్ సుధాకర్‌ను నియమించారు. ఇతని ద్వారా విద్యార్థినీ విద్యార్థులకు తైక్వాండో నేర్పించనున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ చింత శారద తెలిపారు.కరస్పాండెంట్ ఎం.కూర్మినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

**దేవుదల కేజీబీవీలో..**

రేగిడి:మండంలోని దేవుదల కేజీబీవీలో పోలీసు సిబ్బంది ఆధ్వర్యంలో పీడీలు, పీఈటీలు విద్యార్థినులకు సోమవారం కరాటే, వ్యాయామ శిక్షణ తరగతులు నిర్వహించారు. పోలీస్ సిబ్బంది మాట్లాడుతూ ఆత్మరక్షణకు కరాటే దోహదపడుతుందన్నారు. కేజీబీవీ ఎస్‌ఓ లక్ష్మి, ఎంఈఓ-2 బి.ఎరకయ్య, పీడీలు కోటి చక్రధర్, తవిటినాయుడు, హరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

**తైక్వాండోతో ఆత్మరక్షణ**

వంగర: బాలికల ఆత్మరక్షణకు తైక్వాండో శిక్షణ ఉపయోగపడుతుందని తైక్వాండో కోచ్ శ్రీను తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలికలకు తైక్వాండోపై సోమవారం శిక్షణ ఇచ్చారు. ఎస్‌ఐ షేక్‌శంకర్, ఎంఈఓ-2 మీసాల కూర్మినాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీకి అభినందనలు



ఎమ్మెల్సీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంపీపీ అప్పలనరసమ్మ, తదితరులు

రేగిడి:వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌ను ఎంపీపీ దార అప్పల నరసమ్మ, వైస్ ఎంపీపీ వావిలపల్లి జగన్‌మోహనరావు సోమవారం పాలకొండలో కలిసి అభినందనలు తెలి పారు. ఎమ్మెల్సీని కలిసిన వారిలో సర్పంచ్‌లు చుక్క వెంకటనాయుడు, వావిలపల్లి చంద్రశేఖర్, వైఎస్సార్ సీపీ నాయకులు కిమిడి మధుసూదనరావు, పి.రామినాయుడు, దార గురునాథరావు, తదితరులున్నారు.

## హెచ్‌ఎంకు సన్మానం



హెచ్‌ఎం సంగమేశ్వరరావును సన్మానిస్తున్న సర్పంచ్, గ్రామ పెద్దలు

తెర్లాం:మండలంలోని నెమలాం హైస్కూల్ హెచ్‌ఎం దాకోజు వెంకట సంగమేశ్వరరావును ఆ గ్రామ పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు సోమవారం సన్మానించారు ఇటీవల జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకోవడంతో హెచ్‌ఎం సంగమేశ్వరరావును సన్మానించామని సర్పంచ్ మజ్జి నరసింహులు తెలిపారు. పాఠశాలను మరింత అభివృద్ధి చేయాలని హెచ్‌ఎంను గ్రామస్తులు కోరారు. పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

## కొట్టుకు పోయిన కల్వర్టు పరిశీలన



కొట్టుకుపోయిన కల్వర్టును పరిశీలిస్తున్న మంత్రి సంధ్యారాణి

మెంటాడ: ఈ నెల 2వ తేదీన కురిసిన భారీవర్షానికి బడేవలస గ్రామంలో గండిపడిన కునేటి గెడ్డ, జగన్నాథపురం వెళ్లే మార్గంలో కొట్టుకు పోయిన పైపు కల్వర్టును మంత్రి గుమ్మడి సంధ్యారాణి సోమవారం పరిశీలించారు. గెడ్డకు గండి పడిన ప్రాంతానికి వెళ్లలేక గ్రామంలోనే అధికారులతో మాట్లాడారు. జగన్నాథపురం మార్గంలోని కల్వర్టును పరిశీలించి, మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మంత్రి వెంట తహసీల్దార్ అరుణకుమారి, ఎంపీడీఓ భానుమూర్తి, ఇంజినీరింగ్ అధికారులు, టీడీపీ నాయకులు ఉన్నారు.